# భాగ్య నగరంలో నవరాత్రోత్సవం : సమీక్ష



దీపావళి, రంజాన్, క్రిస్మస్ ఏ పండగొచ్చినా భాగ్యనగరానికి కొత్త కళ వస్తూ ఉంటుంది. ఆనందమనేది అందరి మొహంలోనూ తాండవిస్తూ ఉంటుంది. మిగిలిన పండగలన్నీ ఒక ఎత్తైతే వినాయకచవితి ఒకటీ ఒకఎత్తు. రాష్ట్రం మొత్తం మీదా వినాయకచవితి వైభవంగా జరిగేది జంటనగరాలలోనే. ఎవరి కుటుంబంలో వారు వ్యక్తిగతంగా జరుపుకోవడం కన్నా, సామాజిక పండగగా జరుపుకోవడం వల్ల వీధివీధినా నవరాత్రుల సందడి కనిపిస్తుంది. గణపతి నవరాత్రులను సామూహికంగా జరుపుకోవడమనే ఆచారం ముంబై, ఇతర ఉత్తరాది ప్రాంతాల నుంచి  వచ్చింది. ఇక్కడివారు ఆ ఆచారాన్ని స్వీకరించడానికి, స్థానిక, చారిత్రక కారణాలూ లేకపోలేదు. ఇన్ని కారణాలుండడం వల్లే ఈ పండగకు ఇంత కళ వచ్చింది.

గణేష్ ప్రతిమలను తయారు చేయడంలో ఏటా చూపుతున్నట్టే ధూల్‌పేట కళాకారులు ఈ ఏడాదీ తమ  సృజనాత్మక చూపారు. మత్స్యావతార గణేశుడు, మున్నాభాయ్ గణేశ్, సూపర్‌మేన్ గణేశ్, క్రిష్ గణేశ్ ఇలా



చిత్రవిచిత్రమైన ఆకృతులతో గణేశ విగ్రహాలను తీర్చిదిద్దారు. నగరం మొత్తానికే ఆకర్షణా నిలిచే ఖైరతాబాద్ గణేశుడి పరిమాణం ఈసారి కొద్దిగా తగ్గింది. ఇదే స్థాయిలో ఈసారి విశాఖపట్నంలో భారీ వినాయకుడిని ఏర్పాటు చేశారు. ఇదంతా విగ్రహాల కథ అయితే, విగ్రహాలను తయారు చేసే వారి కథ వేరే రకంగా ఉంది. ఇటీవల కాలంలో రాష్ట్రమంతా వ్యాపించిన చికున్‌గున్యా వ్యాధి బారిన ఈ విగ్రహాలు తయారు చేసేవారూ పడ్డారు. దానితో వినాయకచవితి సమీపిస్తున్న చివరి రెండు నెలలలో విగ్రహాల తయారీ తీవ్రంగా దెబ్బతిన్నది. అయినా మొత్తం మీద చూస్తే పండగ మీద ఈ ప్రభావం కనిపించలేదు.

భాగ్యనగరంలో వినాయకచవితి పండగ మీద ఒకప్పుడు ఎన్నెన్నో హాస్య, వ్యంగ్య కథలు వచ్చాయి. అప్పట్లో వినాయకచవితి అంటే చందాల కోసం వేధింపులు, మైకుల హోరుతో ప్రజలకు మతిపోవడం, రోడ్లకు



అడ్డంగా వేసిన పందిళ్లతో ట్రాఫిక్ ఇబ్బందులు దాని మీద వాగ్వివాదాలు ఇలా చాలా కథా వస్తువులే ఉండేవి. ఇప్పుడీ పరిస్థితి కొంత మారింది. చందాలు పూర్తిగా పోలేదు కానీ, మిగిలినవి చాలావరకూ ప్రజామోదమైన స్థాయికి వచ్చాయి. ఇక ఇప్పుడు నడుస్తున్న వివాదమల్లా నిమజ్జనమే.

పూర్తిగా మట్టి గణపతులను తయారుచేసి, పర్యావరణం కలుషితం కాకుండా రక్షించడం, హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనాన్ని నిషేధించడం తదితర అంశాల మీద కోర్టు కూడా దృష్టి సారిస్తోంది. ఇది కూడా అమలైతే ప్రజలకు మరింత ఆనందం కలుగుతుందేమో!